తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 99 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ శనివారం 16 -11-2024 వెల: 5/రూ -



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు.

# 19న వరంగల్‌కు సీఎం రేవంత్

## ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహిరంగసభ

## పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

## ఏడాది పాలనపై 'ప్రజాపాలన విజయోత్సవాలు'

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు.

2లో



## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా సజ్జల

తాడేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీలో భాగంగా పలు నియామకాలను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు.

2లో

## నిర్మలా సీతారామన్, జైశంకర్‌లతో సీఎం భేటీ



# ఐదేళ్లలో అంతులేని దోపిడీ..



### రాజకీయాల్లో అవినీతిని చూశా..

### కానీ, దోపిడీ కోసమే రాజకీయాల్లోకి వచ్చారు

### 45 ఏళ్ల రాజకీయ అనుభవం నాది.. కానీ, ఒక

ఆర్థిక ఉగ్రవాది విధ్వంసం తొలిసారి చూస్తున్నా

కుటుంబానికి ప్రజల సొమ్ముతో విశాఖలో భారీ ప్యాలెస్

సొంత పత్రికకే అడ్డగోలుగా రూ.400 కోట్ల యాడ్స్

రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి నెట్టారు

మోదీ సహకారంతో బయటికి తెచ్చాం: చంద్రబాబు

ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే

అప్పులు 9.74 లక్షల కోట్లుపైనే

ఇంకా తవ్వాల్సింది చాలానే ఉంది

అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఆపేసి.. పోలవరం ప్రాజెక్టును వరదకు వదిలేసి.. ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి.. ప్రభుత్వ టెర్రరిజంతో పరిశ్రమల్ని తరిమేసి.. రాష్ట్రాన్ని అడవి పందుల్లా తినేసి.. దోచిన సొమ్మంతా ఆనాడు తాడేపల్లి ప్యాలెసకు తరలించి.. రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి నెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ అనే మాటతో మోసపోయిన జనం.. వైసీపీ దోపిడీ రాజ్యాన్ని భరించలేక ఇటీవలి ఎన్నికల్లో 57% ఓట్లు, 93% సీట్లతో ఎన్డీయేకు పట్టం కట్టారని తెలిపారు. అలాంటి ప్రజల కోసం 100% కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు.

2లో

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఆగ్రహం

కాంగ్రెస్ పాలనలో పేదలకు ఏనాడూ మేలు జరగలేదు

బడుగు బలహీన వర్గాలు పైకి ఎదిగితే ఆ పార్టీ సహించలేదు

పేదలను ఎప్పటికీ పేదరికంలో ఉంచాలన్నదే కాంగ్రెస్ ఎజెండా



# పేదలను లూటీ చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. గరీబీ హఠావో అంటూ నినాదం ఇచ్చిన ఆ పార్టీ పేదరికాన్ని నిర్మూలించకుండా పేదలను విచ్చలవిడిగా లూటీ చేసిందని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలకు జీవితంలో పైకి ఎదగకుండా కుట్రలు చేయడమే కాంగ్రెస్ విధానమని ధ్వజమెత్తారు.

2లో

ముంబై: కాంగ్రెస్ పాలనలో పేదలకు ఏనాడూ మేలు జరగలేదన్నారు. ఏదైనా మంచి జరిగితే ప్రజలు సంతోషిస్తారు గానీ కాంగ్రెస్ మాత్రం కళ్లలో నిప్పులు పోసుకుంటుందని విమర్శించారు. ఇతరులకు లబ్ధి చేకూరడం ఆ పార్టీకి ఇష్టం ఉండదన్నారు. గురువారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్, పాన్వెల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్ ఎవరికీ అందనంత దూరం వెళ్లిపోయిందన్నారు. ఆ పార్టీ ముమ్మాటికీ పేదల వ్యతిరేకి అని ఆరోపించారు. పేదలను ఎప్పటికీ పేదరికంలోనే ఉంచాలన్న ఎజెండాతో పని చేస్తోందన్నారు.



## కేటీఆర్ నిర్బంధానికి కుట్ర!

కనీసం ఆరు నెలలైనా ప్రజలకు దూరంచేసే వ్యూహం

లేని తప్పిదాలను వెతుకుతూ కేటీఆర్‌పై ఆరోపణలు

పథకంలో భాగమే కాంగ్రెస్ నేతలు, మంత్రుల వ్యాఖ్యలు

రేవంత్‌కు వంత పాడుతున్న బీజేపీ కేంద్ర మంత్రి, ఎంపీ

అధికారుల భుజంపై తుపాకీ పెట్టి పథకం అమలుచేసే కుయుక్తి

2లో

# కాళేశ్వరం లేకున్నా రికార్డు వరి పంట

ఈ ఏడాది 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా

కాళేశ్వరంతోనే ఉత్పత్తి పెరిగిందన్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేమంటారు?

అధికార దాహంతో బీఆర్ఎస్.. రెండో స్థానం కోసం బీజేపీ పోటీ

సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం

మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరు అందించకపోయినా రాష్ట్రంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి అవుతున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా ఈ ఏడాది 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వల్లనే రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరిగిందని ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రులు మీడియాతో మాట్లాడారు. అధికార దాహంతో ఉన్న బీఆర్ఎస్ పార్టీ..



## మహా వికాస్ అఘాడీ సర్కారు కూల్చివేతలో అదానీ హస్తం

ధారావిని సొంతం చేసుకునేందుకే:రాహుల్

2లో




# పేదలను లూటీ చేసిన కాంగ్రెస్

అధికారంలోకి రానివ్వకుండా కాంగ్రెస్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత పేద ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లో ఒక తరం తర్వాత మరో తరం నాయకులు పేదరిక నిర్మూలన గురించి నినాదాలు ఇవ్వడం తప్ప ఆ దిశగా వారు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. వారి బోగసు నినాదాలను ఎవరూ నమ్మొద్దని కోరారు. ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే... "దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తయిన తర్వాత కూడా ఎంతోమంది ప్రజలు కూడు, గూడు, గుడ్డ కోసం పోరాటం సాగించారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి కష్టపడ్డారు. గత పదేళ్లలో ఈ పరిస్థితిలో తొలిసారిగా మార్పు వచ్చింది. మా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఛత్రపతి శివాజీ జన్మించిన మహారాష్ట్ర గడ్డ అంటే నాకెంతో అభిమానం. 2013లో ప్రధానమంత్రి అభ్యర్థిగా నా పేరు ఖరారైన తర్వాత రాయ్‌గఢ్ కోటను సందర్శించా. దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో ఛత్రపతి శివాజీ ఆశీస్సులు స్వీకరించా. స్వరాజ్(స్వపరిపాలన) అనే ప్రతిజ్ఞను శివాజీ మనకు అందించారు. స్వరాజ్‌తోపాటు సురాజ్(సుపరిపాలన) అనే తీర్మానాన్ని మనమంతా ముందుకు తీసుకెళ్లాలి.

**రిజర్వేషన్ల వ్యతిరేకి కాంగ్రెస్**

ఆర్టికల్ 370ని పునరుద్ధరించడానికి, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగాన్ని తీసుకురావడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కుతంత్రాలు సాగిస్తున్నాయి. ఆర్టికల్ 370 కోసం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. జమ్మూకశ్మీర్ మన దేశంలో అంతర్భాగం. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే అక్కడ అమలు కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. పాకిస్తాన్ భాషలో మాట్లాడుతున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు మద్దతు ఇవ్వకూడదు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రయోజనం కోసం అమలు చేస్తున్న రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. అవి దేశ ప్రయోజనాలకు, మెరిట్‌కు వ్యతిరేకమని చెబుతోంది. ఎన్ని దశాబ్దాలు గడిచినా కాంగ్రెస్ మనస్తత్వం మారడం లేదు. అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామని కాంగ్రెస్ యువరాజు బహిరంగంగా చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను చిన్నచిన్న కులాల పేరిట ముక్కలు చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం. ఒక బీసీ నాయకుడు గత పదేళ్లుగా ప్రధానమంత్రిగా కొనసాగుతుండడాన్ని ఆ పార్టీ సహించలేకపోతోంది". అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్రపతి శంభాజీ అభిమానులకు, ఔరంగజేబ్ ఆరాధకులకు మధ్య పోరాటం జరుగుతోందని చెప్పారు.

# సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన సక్సెస్

న్యూఢిల్లీ, నవంబర్ 15: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు న్యూఢిల్లీ పర్యటన విజయవంతమైందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలు చర్చించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు ఈ అంశాలను వివరించారు. వ్యవసాయంపై ఆధారపడిన దానిలో గోదావరి - పెన్నా ప్రాజెక్ట్ ముఖ్యమైనదన్నారు. ఈ ప్రాజెక్టుకు సహాయ సహకారాలు అందించాలని కేంద్రాన్ని కోరామన్నారు. అలాగే అమెరికా వెళ్లే విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందనే అంశంపై సైతం చర్చించామన్నారు. ఇక ఆర్థిక రంగంలో మార్పులపై విదేశాంగ మంత్రితో సీఎం చంద్రబాబు చర్చించారని తెలిపారు. ఆ క్రమంలో విద్యార్థులు, ప్రజల ఇమ్మిగ్రేషన్ సమస్యలు పరిష్కరించాలని విదేశాంగ మంత్రిని సీఎం కోరారని చెప్పారు.

# మహా వికాస్ అఘాడీ సర్కారు కూల్చివేతలో అదానీ హస్తం

నాందేడ్, నవంబరు 15: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ హస్తం ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2019లో అవిభాజ్య ఎన్సీపీ, బీజేపీ మధ్య జరిగిన సమావేశంలో అదానీ పాల్గొన్నట్లుగా ఇటీవల అజిత్ పవార్ వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజకీయ పార్టీల పొత్తు సమావేశంలో ఓ పారిశ్రామికవేత్తకు పనేంటని ప్రశ్నించారు. ధారావి ప్రాంతంపై అదానీ ఆనాడే కన్నేశారని, దానిని సొంతం చేసుకోవడానికి రాజకీయంగా పావులు కదిపారని అన్నారు. ఇందులో మోదీ పాత్ర కూడా ఉందని రాహుల్ ఆరోపించారు.

# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా సజ్జల

ఆయన ఆదేశాల మేరకు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నియమించారు. అంతకుముందు ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా చుండూరు రవిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ (శ్రీకాకుళం జిల్లా), బొడ్డేడ ప్రసాద్, (అనకాపల్లి జిల్లా) నియమితులయ్యారు. కాగా, ఆముదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను నియమించిన సంగతి తెలిసిందే.

# కేటీఆర్ నిర్బంధానికి కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావును సుదీర్ఘకాలం జైలులో నిర్బంధించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్టు కనిపిస్తున్నది. జరుగుతున్న పరిణామాలు ఇవే సంకేతాలను ఇస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్ దా కా పన్నుతున్న వ్యూహాలు, వేస్తున్న ఎత్తులు, వస్తున్న లీకులు వెరసి కేటీఆర్‌ను దీర్ఘకాలం ప్రజల నుంచి దూరం చేయాలన్న పట్టుదలను స్పష్టం చేస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పడినప్పటి నుంచి కేటీఆర్ ప్రతి అంశంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ శ్వేతపత్రం విడుదల చేస్తే బీఆర్ఎస్ స్వేదపత్రం విడుదల చేయటం మొదలు మూసీ, హైడ్రా దాకా, సుంకిశాల నుంచి కొ డంగల్ లిఫ్ట్ ఇరిగేషన్, అమృత్ స్కీమ్ దాకా ప్రతి అంశంలో కేటీఆర్.. బీఆర్ఎస్ శ్రేణులను నడిపిస్తున్న తీరు, ప్రజలు పార్టీ వైపు ర్యాలీ అవుతున్న వైనంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనంగా ఉన్నట్టు తెలుస్తున్నది. దీనికి బలమైన అడ్డుకట్ట వేసేందుకు రేవంత్‌రెడ్డి భారీ కసరత్తు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. అందులో భాగంగానే కేటీఆర్‌ను సుదీర్ఘకాలం నిర్బంధంలో ఉంచే వ్యూహానికి తెరలేపినట్టు తెలుస్తున్నది. పద్ధతి ప్రకారం ముందుగా ఒక్కొక్క అంశాన్ని లేవనెత్తుతూ ఆయనపై ఆరోపణలు చేయడం.. అవి నిజమేనని అనుకూల మీడియాతో చెప్పించడం, వాటికి సం బంధించిన నివేదికలు తమ వద్ద ఉన్నాయంటూ ప్రభుత్వ పెద్దలు వ్యాఖ్యానించడం అందులో భాగమేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.

**అంతా వ్యూహాత్మకమే**

కనీసం అరడజనుకుపైగా అంశాల్లో కేటీఆర్ పేరును ప్రస్తావించడం, దాంట్లో ఏదో జరిగిందని, దానికి ఆయనే బాధ్యుడంటూ ఆరోపణలు చేస్తున్నారని, ఇదంతా వ్యూహాత్మకంగా జరుగుతున్నదేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, ధరణిలో అక్రమాలు, ఔటర్‌రింగ్‌రోడ్ టెండ ర్లు.. ఇలా అనేక అంశాల్లో అవినీతి ఆరోపణలు చేస్తూ.. కేటీఆర్ సహా బీఆర్ఎస్ మూ ల్యం చెల్లించుకోక తప్పదని సర్కార్ పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. వాటికి కొనసాగింపుగా త్వరలో పొలిటికల్ బాంబు పేలుబోతున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సియోల్ వేదికగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ కుట్రకు మరింత ఊతమిస్తున్నాయి. పొంగులేటి వ్యా ఖ్యల అనంతరమే ఫార్ములా ఈ-రేస్ తెరపైకి వచ్చింది. ఆ వెంటనే ఏసీబీ రంగంలోకి దిగటం, కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి కోసం లేఖ రాయటం శరవేగంగా జరిగిపోయాయి. ఇంతలో లగచర్ల ఘటన ప్రభుత్వానికి చేతికందిన అస్త్రంలా దొరికింది. లగచర్ల ఘటనలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టుచేసిన ప్రభుత్వం పనిలోపనిగా ఆయన రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును చేర్చింది. లగచర్ల ఘటనలో కేసీఆర్ హస్తం ఉన్నదంటూ ఆరోపించింది. దీనిని అడ్డంపెట్టుకొని 'కేటీఆర్‌ను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చు' అంటూ ప్రభుత్వ పెద్దల నుంచి లీకుల వెల్లువ మొదలైంది. అయితే, ఫార్ములా ఈ-రేస్‌లో అసలేం జరిగిందో కేటీఆర్ ఖుల్లంఖు ల్లా బయటపెట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వపెద్దలు చేస్తున్న వ్యాఖ్యలు, అనుసరిస్తున్న వైఖరి వెనుక పకడ్బందీ వ్యూహం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు కేటీఆర్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చని లీకులు ఇచ్చి.. అనంతర పరిణామాలు తీవ్రరూపం దాల్చకుండా చూడాలన్నదే ప్రభుత్వం వ్యూ హంగా కనిపిస్తున్నదని అంటున్నారు. అం దులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి ఢిల్లీలో గవర్నర్ అనుమతి రాగా నే కేటీఆర్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లగచర్ల ఘటనలో ఎవరు ఉన్నా వదిలేది లేదని సీఎం పేర్కొనడం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు కేటీఆర్ అరెస్టు కోసం రంగం సిద్ధం చేసినట్టు స్పష్టమవుతున్నదని అంటున్నారు.

# ఐదేళ్లలో అంతులేని దోపిడీ..

(మొదటి పేజీ తరువాయి)

ఇంతటి ఆర్థిక దుస్థితిలో కూడా పెట్టిన రూ.2,94,427 కోట్ల బడ్జెట్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్ర విభజన నాటికి లోటు బడ్జెట్‌తో ఉన్న ఏపీలో ఒక్కో మెట్టు పేర్చుకొంటూ.. రాజధాని, పోలవరం నిర్మాణం చేసుకొంటూ.. పరిశ్రమల్ని స్వాగతించి ప్రోత్సాహకాలిస్తూ తామొస్తే... ఒక్క చాన్స్ పేరుతో ప్రజల్ని ఆర్థిక ఉగ్రవాది జగన్ మోసగించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. మద్య నిషేధం మోసంతో ప్రజల్ని.. అధికారం, అవినీతితో ప్రభుత్వ సంపదను దోచుకుని రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలు కోసం ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై సమీక్షిస్తే 45ఏళ్ల రాజకీయ అనుభవంలో కని, విని, ఎరుగని దారుణ పరిస్థితులు కనిపించాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1994లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దయనీయ స్థితికి తీసుకురాగా, 2024లో వైసీపీ వెంటిలేటర్‌పైకి నెట్టిందని వాపోయారు. ముప్ఫై ఏళ్ల క్రితం తాను ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న కఠిన నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణలతో తెలంగాణ ఆర్థిక పరిస్థితి దేశంలోనే గొప్పగా ఉందన్నారు. విభజిత ఏపీకి 2014లో చికిత్స చేస్తూ.. 2019నాటికి తెలంగాణ కన్నా ఏపీకి 17వేల కోట్లు అదనంగా ఆదాయం వచ్చే స్థాయికి తెచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక స్థితికి మెరుగులు చేపట్టామన్నారు. దురదృష్టవశాత్తూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసి తెలంగాణ కన్నా 62వేల కోట్లు వెనక పడే స్థాయికి దిగజార్చిందని వాపోయారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో బయటికి తీశామని చంద్రబాబు చెప్పారు. "ప్రతి నెల 64లక్షల మందికి పింఛన్లు.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి నిమిషమూ అందరం కష్టపడాలి" అని సీఎం అన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే.. "గత ఐదేళ్ల అరాచక పాలనతో రాష్ట్రం ముప్ఫై సంవత్సరాలు వెనక్కి పోయింది. ఆర్థిక ఉగ్రవాది రాజకీయాల్లోకి వచ్చి అధికారంతో ఇంతలా దోచేసి తప్పించుకుంటారని ఎప్పుడూ ఊహించలేదు.. ఎక్కడ ఎవరికి ఏది చిక్కితే అది లూటీ చేసేశారు.. అప్పులు, తప్పులు, నేరాలు, అసమర్థపాలన, ప్రజా సంపద దోపిడీ, స్కాముల కోసం స్కీములతో రాష్ట్రం సర్వ నాశనమైంది. ఏపీని ఎలా గట్టెక్కించాలనే ఆలోచన చేస్తున్నాం.. అందరం కష్టపడాలి.. పని చేసినంత ఉంది.. పని దొంగల్ని మాత్రం వదిలి పెట్టను. ఎన్డీయేను ప్రజలు దీవించడం వల్ల కేంద్రం బాగా సహకరిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి నరేంద్ర మోదీ సహకారం అందిస్తున్నారు""రాజకీయాల్లో అవినీతిపరుల్ని చూశాం. కానీ, దోపిడీ కోసమే రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని ఇప్పుడు చూస్తున్నాం.. ఇదొక పెద్ద ప్లానింగ్.. మా పార్టీ(టీడీపీ)కి 45ఏళ్లు. కానీ పేపర్, టీవీ లేవు. కానీ, వైసీపీ పెట్టే సమయానికే ఇవన్నీ ఏర్పాటు చేసుకుని సొంత పత్రికకు 400కోట్ల ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో తీసుకున్నారు.. వలంటీర్లకు కూడా వారి పేపర్ ఇప్పించి ఎంత అధికార దుర్వినియోగం చేయవచ్చో అంతా చేశారు.." "డిజిటల్ కార్పొరేషన్ నుంచి డబ్బులు చెల్లించి సోషల్ మీడియాలో సైకోలను తయారు చేశారు.

# 19న వరంగల్‌కు సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)



ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. స్వయం సహాయ బృందాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో సమావేశమై ఆ గ్రూపులకు సంబంధించిన ఆస్తుల పంపిణీ చేస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షించేందుకు సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వరంగల్ పర్యటన రూట్ మ్యాప్, వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. సభకు వచ్చే మహిళలు ఎక్కువ దూరం నడవకుండా పక్కాగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల చిత్రాలను సభ వద్ద ప్రదర్శించాలని సూచించారు. సీఎం సభ, ఇతర కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలని కోరారు. సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శని, ఆదివారాల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి ఉదయం 10 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటారు. అక్కడ నుంచి చంద్రాపూర్‌లో స్థానిక నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం వరుసగా రాజురా, డిగ్రాస్, వార్ధానియోజకవర్గాల్లో ప్రచార సభలు, రోడ్ షోలలో పాల్గొని రాత్రికి తిరిగి నాగ్‌పూర్‌చేరుకుంటారు. రెండోరోజు ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నయగావ్, భోకర్, షోలాపూర్‌నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.



# నిర్మలా సీతారామన్, జైశంకర్‌లతో సీఎం భేటీ

## అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించండి!

**గోదావరి-పెన్నా అనుసంధానానికి సహకరించండి**

**విదేశీ పెట్టుబడులు ఏపీకి వచ్చేలా చూడండి**

**కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు**

న్యూఢిల్లీ: నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు. అదేవిధంగా గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి కూడా సహకరించాలని విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు జరిపిన చర్చల వివరాలను టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు మీడియాకు వెల్లడించారు.

**పునర్నిర్మాణానికి సహకరించండి**

ఇటీవల సంభవించిన వరదల్లో విజయవాడ సహా పలు ప్రాంతాలకు భారీ ఎత్తున జరిగిననష్టాన్ని పూరించేందుకు, దెబ్బతిన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర జీఎస్టీపై ఒక శాతం సర్‌చార్జీని పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. విపత్తుల నుంచి బయటపడేందుకు జీఎస్టీలో ఉన్న నిబంధనల మేరకు ఈ సర్‌చార్జీని పెంచితే వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. అదేవిధంగా పోలవరం నుంచి గోదావరి నదీ జలాలను పెన్నాకు అనుసంధానం చేసేందుకు సహకరించాలని కోరారు. మధ్యప్రదేశ్‌లో కెన్-బెట్వా మాదిరి గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి తోడ్పడితే ఏపీలో కూడా కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. అదేవిధంగా వెనుకబడిన జిల్లాలైన ప్రకాశం, రాయలసీమ ప్రాంతాలకు తాగు నీరు అందుతుందని చెప్పారు. రూ.60 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్రం సహకరిస్తే త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను త్వరలోనే రూపొందిస్తామని చంద్రబాబు చెప్పారు. అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను సీఎం చంద్రబాబు కోరారు.

# పోలీసులు లగచర్ల రైతుల పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలు పెట్టారు: కేటీఆర్

రేవంత్ రెడ్డి... కావాలంటే మమ్మల్ని జైల్లో పెట్టు, రైతులను వదిలేయ్'

సంఘటనతో సంబంధం లేని వాళ్లను జైల్లో పెట్టారు

రాబంధులా వచ్చి పేదల భూములను కొల్లగొడుతున్నారు

అరెస్ట్ అయిన 21 మంది రైతులు అంతా కూడా పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలే కేటీఆర్









**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15(డైలీ రిపోర్ట్):** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల బృందంతో కలిసి సంగారెడ్డి జైలులో అక్రమంగా నిర్బంధించిన కొడంగల్ నియోజకవర్గం లఘుచర్ల గ్రామ రైతులను పరామర్శించారు కేటీఆర్. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ70 మందిని అరెస్ట్ చేస్తే తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 21 మందిని మాత్రమే ఉంచి కాంగ్రెస్ వాళ్ళని పంపించేశారు. దుద్యాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు.. రమేష్, నర్సింహులు, రాములు నాయక్ కూడా దాడిలో పాల్గొన్నారు. కాని తిరుపతి రెడ్డి ఫోన్ చేయగానే వాళ్లను వదిలేశారు.ఈ దాడి మొత్తం బీఆర్ఎస్ వాళ్లే చేపించారని ఇది రాజకీయ దాడిగా చిత్రీకరిస్తూ రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారాన్ని అన్నారు. దాడి జరిగినప్పుడు ఊరిలో లేని వాళ్లని కూడా ఎందుకని అరెస్ట్ చేశారు .కులగణన కోసం వచ్చిన ప్రభుత్వ ఉద్యోగి అక్కడ లేకపోయినా కూడా అతన్ని అరెస్ట్ చేసి జైలులో పెట్టారు.వనపర్తిలో ఐటీఐ చదువుతున్న ఒక గిరిజన విద్యార్థి.. గొడవ జరిగింది కదా ఇంట్లో వాళ్ళు ఎలా ఉన్నారని చూసి పోదామని వస్తే అతన్ని కూడా అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. పోలీసులు లగచర్ల రైతుల పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలు పెట్టారన్నారు. కొడంగల్ సీఐ, ఎస్ఐ వికారాబాద్ ఎస్పీ వీళ్ళంతా కలిసి లగచర్ల రైతుల పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలు పెట్టారు. కాళ్ళు, చేతులు కమిలిపోయి ఉన్నాయి మేజిస్ట్రేట్ ముందు ఎందుకు చెప్పలేదు అని అడిగితే..చెప్తే మళ్లి కొడతాము, మీ ఇంటికి పోయి ఇంట్లో వాళ్ళని కూడా కొడతామని బెదిరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ. చింత ప్రభాకర్, ఎమ్మెల్యే , అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యే దేవరకొండ, జాన్సన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ శంభుపురం రాజు, పార్టీ సీనియర్ నాయకులు, ఖానాపూర్ నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్

**శంకర్‌పల్లి: నవంబర్ 15:** (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి రెండవ వార్డు గణేష్ నగర్ కాలనీలో పోచమ్మ దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వేకువ జామున మహిళలు తమ తమ కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చి ప్రత్యేకంగా దీపాలు వెలిగించి శివాలయంలో శివునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ పట్టణ, వార్డు ప్రజలు సుఖ సంతోషాలతో, ఆనందాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవదేవుడిని కోరుకున్నట్టు పేర్కొన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఫతేపూర్ రైల్వే ట్రాక్ వద్ద యువకుడి మృతి



**శంకర్‌పల్లి నవంబర్ 15:(డైలీ రిపోర్ట్):** రైల్వే ట్రాక్ వద్ద యువకుడి మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మునిదేవునిపల్లి గ్రామ వాసి వడ్ల శేఖర్ చారి (30) శుక్రవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి మున్సిపాల్టీ ఫతేపూర్ రైల్వే ట్రాక్ వద్ద శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రమేష్ చారి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో కార్తీక దీపోత్సవం





**శంకర్పల్లి నవంబర్ 15:(డైలీ రిపోర్ట్):**కార్తీక పౌర్ణమి సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి చిన్న శంకర్‌పల్లి శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం మహిళలు స్వామి వారికి పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. దేవాలయ ప్రాంగణం భక్తులతో సందడి నెలకొంది. మహిళలు ఉదయాన్నే ఆలయానికి వచ్చి దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడమే మా లక్ష్యం

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.



**ఏలూరు, నవంబరు 15:(డైలీ రిపోర్ట్):** పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ మహేష్ కుమార్ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు నుండి అర్జీలు స్వీకరించారు. తనకు చట్టసభలో అడుగుపెట్టే అవకాశం కల్పించిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్దే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో నెలకొన్న సమస్యలతో కూడిన జాబితా సిద్ధం చేశామని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.








# " సుడా " ఛైర్మెన్ ఎంపిక పై కాంగ్రెస్ కసరత్తు !






## పరిశీలనలో మార్క సతీష్ పేరు ..

### ఢిల్లీ పెద్దలతో సతీష్ లాబీయింగ్ ..

### దామోదర , పొన్నం , శ్రీధర్ బాబు , మహేష్ కుమార్ గౌడ్ ల ఆశీస్సులు సతీష్ కేనా !

### త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం !!

### 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న మార్క ..

### సతీష్ అభిమానుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం ..







**సిద్ధిపేట , ( డైలీ రిపోర్ట్ ) , నవంబర్ 15 :** సిద్ధిపేట సీనియర్ కాంగ్రెస్ నేత మార్క సతీష్ కుమార్ గౌడ్ కు మంచి రోజులు వచ్చాయా.. ? అంటే అవుననే అంటున్నారు ఆ పార్టీ శ్రేణులు. 35 ఏళ్లుగా పార్టీ కోసం అలుపెరుగని సేవలందిస్తున్న సతీష్ కు సిద్ధిపేట అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ( సూడా ) చైర్మన్ పదవి దక్కడం ఖాయమంటున్నారు. ఇప్పటికే ఢిల్లీ స్థాయిలో సతీష్ లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు నామినేట్ పదవుల కోసం ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా , రాష్ట్ర స్థాయి పదవులతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ , ఆలయాల ఛైర్మెన్ పదవుల కోసం కాంగ్రెస్ ముఖ్య నేతలు , మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సిద్ధిపేటలో అత్యంత కీలకమైన పదవి " సుడా " ఛైర్మెన్. గత పదేళ్ళలో సిద్ధిపేట పట్టణం బాగా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో మునిసిపల్ కు ఆదాయం కూడా బాగా పెరిగింది. పట్టణానికి సుమారు పది కిలో మీటర్ల పరిధిలో ఉన్న చాలా గ్రామాలను కలిపి సిద్ధిపేట అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ( సుడా )ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పట్టణానికే పరిమితమైన " సుడా " పరిధిని పెంచేందుకు జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోని 283 గ్రామాలతో

" సుడా " ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేతలు ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు ప్రచారంలో ఉంది. దీంతో " సుడా " పదవికి పోటీ మరింత పెరిగింది. ప్రస్తుతం అధికార పార్టీ పెద్దలు " సుడా " ఛైర్మెన్ ఎంపిక పై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్క సతీష్ పేరును పరిశీలనలోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది .

**మార్క సతీష్ వైపే అధిష్టానం మొగ్గు ..?**

సిద్దిపేట అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఛైర్మెన్ పదవి కోసం అనేక మంది నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో మార్క సతీష్ కుమార్ , తాడూరి శ్రీనివాస్ , గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి , బొమ్మల యాదగిరి , ఖలీం తదితర నేతలు " సుడా " చాలా రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా , సిద్ధిపేట జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ , ఉమ్మడి జిల్లా ఇంఛార్జి మంత్రి కొండా సురేఖ , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితర నేతలను కలిసి " సుడా " ఛైర్మెన్ పదవిని ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ మార్క సతీష్ మాత్రం మంత్రి దామోదర రాజనర్సింహా , టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు పొన్నం , శ్రీధర్ బాబు , కొండా సురేఖ , మాజీ మంత్రి గీతారెడ్డి , మాజీ విప్ జగ్గారెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నేత శ్యాంమోహన్ ల ద్వారా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వెళ్ళి ఏఐసీసీ కీలక నేతలు దిగ్విజయ్ సింగ్ , జైరాం రమేశ్ లను కలిశారు. " సుడా " ఛైర్మెన్ పదవిని తనకే ఇప్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అగ్రనేతలు కూడా సతీష్ కుమార్ విషయంలో సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.



ఎన్ఎస్ యూఐలో రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లతో మార్క సతీష్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. సతీష్ కూడా ఎన్ఎస్ యూఐలో వీరితో కలిసి పని చేశారు. ఇది కలిసి వచ్చే అవకాశంగా సతీష్ అనుచరులు భావిస్తున్నారు.

**మూడున్నర దశాబ్ధాలుగా కాంగ్రెస్ కు సేవలు ..**

కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న మార్క సతీష్ కుమార్ గౌడ్ మూడున్నర దశాబ్ధాలుగా పార్టీకి సేవలు అందిస్తున్నారు.



మొదటి నుంచి సతీష్ కుటుంబం కాంగ్రెస్ పార్టీతో మమేకం కావడంతో ఈయన కూడా అదే పార్టీలో కొనసాగుతూ సేవలందిస్తున్నారు. సతీష్ అన్న దివంగత నాయకుడు మార్క శ్రీనివాస్ గౌడ్ కూడా కాంగ్రెస్ పార్టీలోనే పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా , లేకున్నా పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నాయకుడు మార్క సతీష్. అప్పటి టీడీపీ , నిన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాల పై సతీష్ కుమార్ గౌడ్ అలుపెరుగని పోరాటం చేశారన్న పేరు పార్టీలో ఉన్నది. అప్పటి పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసి కేసుల్లో ఇరుక్కున్నారు. పార్టీ కోసం ఆస్తులను కూడా కరిగించారని సతీష్ అభిమానులు చెబుతారు. ఇలాంటి వ్యక్తికి " సుడా " ఛైర్మెన్ పదవిని కట్టబెడితే సిద్ధిపేటలో కాంగ్రెస్ కు పూర్వ వైభవం వస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు. " సుడా " ఛైర్మెన్ పదవి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసినట్లు సమాచారం.



**విద్యార్థి దశలోనే రాజకీయాల పై ఆసక్తి ..**

విద్యార్థి దశ నుంచే సతీష్ కుమార్ గౌడ్ రాజకీయాలను వంటబట్టించుకున్నారు. ఎన్ఎస్ యూఐ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన ఈయన అంచలంచెలుగా ఎదిగారు. ఎన్ఎస్ యూఐ , యూత్ కాంగ్రెస్ లలో పట్టణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవులను దక్కించుకున్నారు. 20 ఏళ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సతీష్ .. జిల్లాల విభజన తర్వాత కూడా సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగానే కొనసాగుతున్నారు. మాజీ మంత్రి, దివంగత నేత అనంతుల మదన్ మోహన్ ప్రియ శిష్యునిగా ముద్ర పడ్డారు. మదన్ మోహన్ ను స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని సతీష్ చెబుతారు.

**కాంగ్రెస్ లో ఉన్నత విద్యా వంతుడు మార్క సతీష్ ..**

సిద్దిపేట కాంగ్రెస్ పార్టీలో ఉన్నత విద్యా వంతునిగా మార్క సతీష్ కు పేరుంది. ఎంఏ , ఎంపెడ్ తో పాటు యోగాలో సర్టిఫికెట్ కోర్స్ చదివారు. ఎల్.బి. స్టేడియంలో స్పోర్ట్స్ కోచ్ గా వచ్చిన ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లో కొనసాగుతున్నారు.

**క్రీడల్లో ప్రతిభావంతుడు ..**

కాంగ్రెస్ పార్టీలోనే కాదు క్రీడల్లో కూడా మార్క సతీష్ ప్రతిభావంతుడు. సిద్ధిపేట తరపున వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని పలు పథకాలు సాధించారు. 20 కిలో మీటర్ల మారథాన్ ( పరుగు పందెం ) పోటీలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ చేతుల మీదుగా ఉత్తమ





రన్నర్ గా పురస్కారాన్ని అందుకున్నారు.

**సామాజిక సేవల్లోనూ ముందే ..**

రాజకీయాలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో కూడా సతీష్ కుమార్ గౌడ్ ముందుంటారు. పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు , బూట్లు , అన్న వితరణ వంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తుంటారు. కరోనా సమయంలో అనేక మందికి నిత్యావసరాలను పంపిణీ చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆక్సీజన్ కాన్సెంట్రెషన్లను కరోనా బాధితులకు అందించారు. మందులు , ఆహార పొట్లాలు అందించారు. కరోనా బారిన పడి మరణించిన వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రతి ఏటా నెహ్రూ , ఇందిరా , 5రాజీవ్ గాంధీల వర్ధంతి , జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు అన్నదానం , రోగులకు పండ్లు , బెడ్ షీట్లు అందిస్తారు.

**రాహుల్ తో కలిసి 456 కిలోమీటర్ల పాదయాత్ర ..**

కాంగ్రెస్ పార్టీ అంటే వల్లమాలిన అభిమానం చూపించే సతీష్ పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ నిర్వహించిన భారత్ జోడో పాదయాత్రలో సతీష్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ , కర్నాటక , మహారాష్ట్రల్లో ఆయన 456 కిలో మీటర్ల పాటు రాహుల్ గాంధీతో కలిసి నడిచారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వహించిన పాదయాత్రలో కూడా సతీష్ పాల్గొన్నారు. చేవెళ్ళ నుంచి నిజామాబాద్ వరకు 287 కీలో మీటర్ల మేర వైఎస్ తో కలిసి పాదయాత్ర చేశారు.





Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707